# ఉలిపి కట్టెలు

ఉలిపి కట్టె అన్నమాట విని విని విసుగెత్తి పోయాను. అదేమిటో ఎలా ఉంటుందో తెలియకపోతేనేం? ఏ సందర్భంలో వాడతారో బాగా తెలుసు. కాలువ ఒడ్డుకు పోయి, ఓపికగా పట్టి తెచ్చిన చేపలు తాతయ్య నాయనమ్మకిచ్చి ఎండెయ్యమనేవాడు. ఎండుచేప కాల్చి నంజుకోందే పాపం ముద్ద దిగేది కాదు. నా నోటిక్కూడా అందించేవాడు తినమని. అన్నీ నే తిన్నా, ఆ వాసనే గిట్టేదికాదు నాకు. నా కొద్దంటే, "ఓ యబ్బో మనింట ఉలిపి కట్టెలా పుట్టు కొచ్చాడ్రా ఈ నాగప్పగాడు" అని గురుక దగ్గా నవ్వా కలిపేవాడు.

తాతయ్య చుట్ట పొగకు దూరంగా జరిగి పోయేవాడిని. ఇప్పటికీ ఏదన్నా పార్టీలో సిగరెట్టు ముట్టించి రెండు దమ్ములు తీస్తే తీస్తాగానీ చుట్టవాసన గిట్టదు.

అన్నతో పొలానికి పొమ్మనేవాడు మా నాయన. దారిలో బడి బయట చెట్టు కింద పిల్లలంతా చుట్టూతా కూర్చుని ఎక్కాలు గొంతు కలిపి కోరస్‌లా పాడుతూ వుండేవారు. నాకు చాలా మజాగా ఉండేది చూసినా, విన్నా. నేనిస్కూలికి పోతానన్నాను. మా నాయన విసుక్కుని ఉలిపి కెట్టగాడన్నాడు. అప్పుడు మా నాయనమ్మే ముచ్చటపడి నన్ను స్కూల్లో చేర్పించింది.

అక్కడ కూడా తగువే.

"నువ్వు ఆఫీసరువైతే ఎలాగ? పేరు బాగోదు. పేరు నాగేశ్రావని ఏపించుకో" అంది మా అక్క.

తల అడ్డంగా ఊపాను.

అక్క కొంటెగా నవ్వింది.

అలా మా ఇంటా బయటా అలవాట్లూ, ఆలోచనలూ నాకు భిన్నంగా ఉండేవి.

లెక్కలు నాకు భలే ఇష్టం. పబ్లిక్ పరీక్షలో నూటికి తొంబై నాలుగొచ్చాయి. అయితే తెలుగు పేపర్లో అరవై ఆరొచ్చాయి. ఒక టీచరు ఆ మార్కులు చూసి గుట్లు మిటకరించి, "తెలుగులో ఇన్ని మార్కులెక్కడ కొట్టుకొచ్చావురా?" అన్నాడు.

నాకెందుకో ముల్లు గుచ్చినట్టయింది. "తెలుగు కొందరి జాగీరా" అన్నాను చురుగ్గా చూసి.

నన్నేమీ అనకపోయినా ఎందుకో ఓరగా చూశాడు.

నేనెవరితో మాట్లాడుతున్నా మా నాయనమ్మ పొంగిపోయి "నాగప్పా - నీ మాటతీరే శానా మారిపాయెగదరా" అనేది.

ఒక పెద్ద ఆఫీసులో నాకు ఉద్యోగమొచ్చినప్పుడు నాయనమ్మ ఇంకా బతికే ఉంది. పదిమందికీ చెప్పుకుని మురిసిపోయింది. నే చేరిన ఆఫీసు చిన్నదేం కాదు. మూడురోడ్ల మధ్యగా విస్తరించినది. అందులో వేల సంఖ్యలో ఉద్యోగులు, వందల సంఖ్యలో ఆఫీసర్లు, సుమారు ఇరవైదాకా ఆలిండియా సర్వీస్అధికార్లు. కొత్తవాళ్ళెవరైనా పనిపడి ఆ ఆఫీసు లోపలికి వస్తే బయటకెలా వెళ్ళాలో తెలియక తికమక పడిపోయేవారు.

నేను పనిచేస్తున్న విభాగంలో నాతోటి వాళ్ళంతా ఏదో పరీక్ష గురించి మాట్లాడుకుంటున్నారు. అది పాసవకపోతే ఇంకా పై ఉద్యోగాలు రావంట. కొన్నే ఛాన్సులు. అందులో పాసవకుంటే ఇక అంతే - అని అప్పటి రూల్స్ చర్చించుకుంటున్నారు.

నేను కూడా ఉత్సాహంగా ఎన్ని మార్కులు రావాలి పాసవడానికని ఆ గుంపులో ఒకణ్ణి అడిగాను. నలభై శాతం అనుకుంటానని కల్లాకపటం లేకుండా జవాబిచ్చాడు. కానీ ఆ పక్కనే ఉన్నవాడు గుసగుసలాడుతూ కిసుక్కున నవ్వి అక్కడ నుండి వెళ్ళిపోయాడు. అయితే ఏమన్నాడో నా చెవిని పడకపోలేదు. "రాజ బంధువులకి అన్ని మార్కులతో పనిలేదేమో గురూ!" అన్నాడు. వాడి మాటల్లోని వ్యంగ్యం అర్థమైంది. నేను మళ్ళా వాడితో నోరు మెదపలేదు కానీ లెక్కలు, చేయడం అంకెలతో ఆటలాడుకోవడం నాకు ఇష్టమే.

కావలసిన పుస్తకాలు తెచ్చుకున్నాను. ఆఫీసు సమయం అయిపోయేక అప్పట్లో నడుపుతున్న క్లాసులన్నీ తప్పకుండా వెళ్ళాను. పరీక్షలయ్యాక కొన్ని నెలలకి ఆఫీసంతా హడావుడి. నేను పరీక్ష పాసైనాను. ఆ తర్వాత అందరికీ మార్కుల లిస్టు ఢిల్లీ నుండి వచ్చిందని విని నేను కూడా వెళ్ళి నా మార్కులు నోట్ చేసుకుని వచ్చాను. అప్పటికి అదే విభాగంలో నాతో పరీక్ష రాసిన వాళ్ళు కొందరు వేరే వేరే చోటకి మారిపోయినా నన్ను ఎగతాళి చేసి బిరుదు ఇచ్చిన వాడింకా మా సెక్షన్‌లోనే ఉన్నాడు. మా సెక్షన్ ఆఫీసర్ నా మార్కులు చూసి ఎంతో ప్రశంసించాడు. కానీ నన్ను హేళన చేసినవాడు మొహం దించేసుకున్నాడు. వాడికి బొటా బొటీ పాసుమార్కులు అన్నిట్లో వచ్చినా ఒక ప్రాక్టికల్ పేపర్లో రెండు మార్కులు తగ్గిన కారణంగా ఫేల్ అయ్యాడు. నా మార్కులు వాడికొచ్చిన మార్కులకు రెండింతలు వచ్చాయి. కాస్త ఇంగ్లీషు ప్రెస్సీలోనే తక్కువ వచ్చాయి.

కాలచక్రం దాని పని అది చేసుకుని గిరగిర తిరుగుతోంది. రెండవ పరీక్ష కూడా పాసయిపోయి ప్రమోషన్‌కి సిద్ధంగా కూర్చున్నాను.

ఇంకో చిత్రమైన అనుభవం మళ్ళా ఎదుర్కొన్నాను. ఒక మధ్యాహ్నం అడ్మినిస్ట్రేషన్ విభాగం అధికారి నన్ను పిలిచి ప్రమోషన్ వచ్చినట్టు చెప్పి ఇంకో గంటలో ఆర్డరు అందుకుని వెళ్ళమన్నాడు. నాతో పరీక్ష పాసయిన వాళ్ళూ, నా కన్నా ముందు పరీక్ష పాసయిన వాళ్ళూ నా వేపు చూసిన చూపులు తూపుల్లా గుచ్చినట్లు తోచింది. మనసు వికలమైంది. అప్పట్లో నాలో ఆవేశపు జోరు తక్కువేం కాదు.

ఎవ్వరికీ చెప్పకుండా వెళ్ళి కుల ప్రాతిపదిక మీద ఇస్తున్న ప్రమోషన్ నాకు వద్దు - అంటూ సంతకం పెట్టిన కాగితం అడ్మినిస్ట్రేషన్‌లో ఇచ్చి వచ్చి నా పనిలో కూరుకుపోయాను. అప్పటికి నాకున్న లోకానుభవమెంత? నా వేపు అంతా చిత్రంగా చూస్తూపోతున్నారు. నే చేసిన పని ఒక పెద్ద సంచలనం సృష్టిస్తుందనుకోలేదు నేను. హేమా హేమీలు ఆఫీసర్లు నన్ను పిలిచి కాగితం వెనక్కు తీసుకోమన్నారు. ఇది వరకు హాస్టల్‌లో నాకు బాగా పరిచయం ఉన్న సీనియర్ గట్టిగా మందలించాడు.

"చూడు నాగప్పా! ఇది నువ్వు వద్దనేది కాదు. రాజ్యాంగపరంగా వచ్చిన మార్పు. ఎందరో నాయకులు సామాజిక న్యాయాన్ని సాధించాలని తర్కించి, తెచ్చిన ఏర్పాటే కానీ - అదేదో దయాధర్మభిక్షగా ఇస్తున్నది కాదురా సన్నాసీ" అన్నాడు.

"ఉలిపి కట్టె పని చెయ్యకు" అన్నాడొక ముసలాయన.

ఒక పెద్ద అధికారి నన్ను పిలిచి - నా కాగితాన్ని చేతికిచ్చేసి, ప్రమోషన్ ఆర్డరు అందించి చిరునవ్వుతో అభినందించాడు.

అక్కడితో సంచలనం కాస్తా పాతపడింది. చిత్రమేమిటంటే నన్ను హేళన చేసిన వాడు నా మొహంలోకి చూడలేక తప్పించుకుంటున్నాడు.

ఆ రోజుల్లోనే వ్యక్తికీ, సమాజానికీ ఉన్న సంబంధం గురించీ, మన దేశంలోని సామాజిక స్వరూపం గురించీ ఎక్కువగా నా ఆలోచనలు సుళ్ళు తిరిగేది. కాలచక్రం ఎవరికోసం ఆగుతుంది కనుక. ఎన్నో అనుభవాలు జీర్ణించుకున్నాను. ఢక్కా ముక్కీలు తిన్నాను. అయితే నే చేసే పనిలోనే పెంచుకున్న అనుభవం, ఆత్మవిశ్వాసంతో మూడు నాలుగేళ్ళు గడిచిపోయాయి.

ఒకసారి, రెండు నెలల శలవు తర్వాత ఆఫీసులో డ్యూటీలో చేరాను. ఇదివరకు నే పనిచెయ్యని కొత్త సెక్షన్‌లోకి తోశారు. హెడ్ క్వార్టర్స్‌లో ఖాళీలేదనీ, సోంపేటలో ఉన్న ఆడిట్ పార్టీలో ఖాళీగా ఉందనీ, ఆపార్టీలో ఎవడో మూర్తి ఒక్కడే పదిహేను రోజుల నుండి పార్టీ బాధ్యతలు మోస్తున్నాడనీ చెప్పి ఆర్డరు చేతికిచ్చేశారు. ఆడిట్

శాఖలో పనిచేస్తున్నప్పుడు ఇలాంటి స్థానభ్రష్టం తప్పేది కాదని తెలుసు. రోట్లో తల పెట్టాక రోకటి పోటుకు భయపడే మనిషినీ కాను. అయితే ఒకటి. మైన్ ఆఫీసులో పని ఎక్కువున్నా, మనుషులెలా ఉన్నా ఆఫీసు మూశాక ఇంటికి పోవడం, ఆలు బిడ్డలతో కలిసి, ఆఫీసును మరిచిపోవడం, మర్నాడు తాజాగా ఆఫీసు మొహం చూడ్డం ఒక ఎత్తూ - ఇల్లూ వాకిలీ మరచి నెలల తరబడి మూల మూలలా ఆఫీసులున్న ఊళ్ళు తిరిగి, తెలియని ఊళ్ళలో, ఏ పరిచయం లేని ఉద్యోగులతో కలిసి జీవించడం ఒక ఎత్తు. రెండేళ్ళ క్రిందట ఆరు నెలలపాటు ఒక ఆడిట్ పార్టీలో తిరిగిన అనుభవాలు కొన్ని గుర్తున్నాయి. ఎదుటి మనిషి అంటే అయిష్ట మున్నప్పుడు దాన్ని ప్రకటించడానికి నోటి మాటే అక్కర్లేదు. ప్రక్కనున్న కుర్చీని బర్రున చప్పుడు చేస్తూ దూరంగా లాగి కూర్చోవచ్చు. ఒకడు నీరు తాగి పెట్టిన గ్లాసును ఇంకొకడు వాడ్డంలో కూడా వ్యక్తం చెయ్యవచ్చు. అయితే అప్పుడు నే వెళ్ళిన పార్టీ మారుమూల ప్రాంతాలకు పోయే అవసరం ఉండేది కాదు. పని కూడా కాస్తా తెలిసినదే.

ఇప్పుడున్న విభాగంలో పని కొంత సీనియర్ దగ్గర నేర్చుకోక తప్పదు. పార్టీలో ఇద్దరే ఆఫీసర్లు ఉంటారు. వాళ్ళ పనిని అప్పుడప్పుడు పర్యవేక్షించడానికి పై అధికారి వచ్చిపోతూ వుంటాడు. నేను సోంపేటలో ఉన్న పార్టీలో చేరి ఒక నెల శ్రీకాకుళం జిల్లా పరిసరాల్లో తిరిగి హైదరాబాద్ మీదుగా కొంత ఇతర ప్రాంతం తిరగాలి. అప్పట్లో శ్రీకాకుళం అంటే వెనుకపడ్డ ప్రాంతమే. దోమలు, మలేరియా, ఫైలేరియా.

అవసరమైన కోడ్స్ మాన్యువల్స్, ఫైల్సు పట్టుకున్నాను. ఎడ్వాన్స్ ట్రావెలింగ్ ఎలవెన్స్ అందుకున్నాను. కేంటీన్‌లో కాఫీ తాగుతూవుంటే ఒకడు పలకరించాడు. సోంపేట వెళ్తున్నట్టు మాటల్లో చెప్పాను.

"వెళ్ళక వెళ్ళక ఆ మూర్తిగాడి పార్టీకా? వాడితో ఎవ్వరికీ పడదు. ఎవర్ని పంపినా మొరాయిస్తారు. కొత్తగా వచ్చావని నిన్ను తోసేసినట్టున్నారు. ఆ ప్రోగ్రామ్స్ వేసే వాడికో విస్కీ బాటిల్ పడేస్తే తలలుమార్చి నిన్నెక్కడికైనా వేసేవాడుగా" -అన్నాడు.

ఈ విభాగంలో నాకంతా కొత్తవాళ్ళే. బాటిల్ ఇచ్చి ఎవడి కాళ్ళో ఎందుకు

పట్టుకోవాలి? - అని నా మనసులో అనుకుని అక్కడి నుంచి లేచిపోయాను. నా పని నే చేసుకుపోగల ధైర్యం ఉంది. ఇక దోమలకే జడవాలేమో కానీ, మనుషులతో భయమేమిటి? ఏమైనా సరే ఎదుర్కొడానికే సిద్ధపడ్డాను.

కిటికీ దగ్గర కూర్చుని రైలు ప్రయాణం చెయ్యడం చిత్రమైన అనుభవం. దానికి వయసుతో సంబంధం లేదు. చిన్నతనంలో ఎంత థ్రిల్-మజా వుందో ఇప్పుడూ అంతే. దగ్గరగా ఉన్న చెట్లూ పుట్టలూ వెనక్కి జోరుగా పరుగు తీయడం, చాలా దూరంగా ఉన్న కొండలు నెమ్మదిగా వలయం తిరుగుతూ రైలు ఇంజను దిశగా మూసుకు వస్తున్న భ్రాంతి కలగడం, రైలు మార్గానికి సమాంతరంగా ఉన్న టెలిఫోన్ తీగలు మీదకు వెళ్తూ క్రిందకు దిగడం, ఆ తీగల మీద నల్లని పిట్టలు కూర్చోడం చిన్నతనం నుండీ ఆకర్షిస్తున్నా, పాతపడి పోలేదు. రకరకాల మనుషులు, ప్రాంతీయమైన యాసలు, కట్టూబొట్టూ, మూటా ముల్లే చూస్తూ వుంటే మిగతా ఆలోచనలు ఎక్కడికో వెళ్ళిపోయాయి. అయితే కిటికీలోని దృశ్యాలు చీకటిని పులుముకున్నాక ఆలోచనలు కొంతవరకూ అంతర్ముఖంగా సాగుతాయి. అయ్యో! ఎంత పని చేశాను. అతి జాగ్రత్తగా కొనుక్కొని తెచ్చుకున్న దోమతెరను హోల్డాల్‌లో కుక్కుకోడం మరచి పోయాను. రాత్రి తొమ్మిది కావస్తోంది. ఆ స్టేషన్లు కొత్త. సోంపేట్లో రెండే నిమిషాలు ఆగుతుందిట రైలు. ఆ స్టేషను ఎప్పుడొస్తుందని మాటిమాటికీ అడగడం చూసిన ఒక వృద్ధుడు నేనెక్కడి వాడినో, ఎందుకు సోంపేట వెళ్తున్నానో అడిగాక పగలబడి నవ్వాడు.

"నా ననుకుంతానే ఉన్నాను. ఈడ మడిసివికావు. సోంపేట టేసన్లో ఎవరూ దిగరు. పలాసాలో దిగి బస్సులో పోతారు. ఊరి మద్దెన సత్రం ముందాగుతాది. నీకు జటకా బండైనా దొరుకుతాదో లేదో" - అని స్టేషను రాగానే గుర్తుచేసి నా పెట్టె హోల్డాల్ చేతికి అందించి సహాయం చేశాడు. ఎవరి కోసమో స్టేషన్‌కి వచ్చిన జటకా కదిలిపోతూ వుంటే - ఆపి, నా గోడు చెప్పుకుని అందులో ఇరుక్కుని కూర్చున్నాను.

ఆ సత్రపు మేడ మీద వీధి వేపున ఒక గది మాత్రం ఖాళీగా ఉందని అక్కడ కునికి పాటు పడుతున్న గుమాస్తా తాళం చెవి చేతికివ్వడానికి నులక మంచం మీంచి లేచాడు. నడకలో ఒక కాలు బరువుగా ఎత్తివేస్తున్నాడు పాపం బోదకాలు.

తాళం తీసి గదిలో అడుగు పెట్టగానే దోమలు జుమ్మున లేచాయి. బయట వరండాలో వీస్తున్న చల్లగాలికి దోమల జోరు అంతగా లేదు. ఇంకోగది ముందు వరండాలో తెల్లని దోమతెర నేలను తాకుతోంది. కిటికీ ఊసలకు, పిట్ట గోడలోని కటకటాలకూ తాళ్ళతో కట్టారు. అటు చూశాను ఏదో ఆలోచిస్తూ వరండా చివర నిలబడ్డ వ్యక్తి నన్ను చూసి కాస్త దగ్గరగా వచ్చాడు. ఇది వరకు దగ్గర పరిచం లేకున్నా, ముఖపరిచయంతో ఒకే ఆఫీసు వాళ్ళమని గుర్తుపట్టుకున్నాం.

"ఇప్పుడు బస్సేదీ రాలేదే ? ఎలా వచ్చారు ?" అని అడగ్గానే వచ్చిన తీరు చెప్పాను.

"అయ్యో పాపం! ఎవ్వరూ సరిగ్గా గైడ్ చెయ్యలేదు కాబోలు. భోంచేశారా ?"

రైలులో ఏదో తింటూనే ఉన్నాను. ఇక ఆకల్లేదు కానీ నేనో పొరపాటు చేశానని, దోమ తెర మరచిన సంగతి చెప్పాను.

"నా దగ్గర ఓడోమాస్ క్రీమ్ కూడా ఉంది. మొహానికీ, కాళ్ళూ చేతులకీ దట్టంగా రాసుకుంటే నాలుగైదు గంటల దాకా ఢోకా లేదు. తెల్లారితే బజారులోరడీమేడ్‌దీ, లేకుంటే దోమతెర గుడ్డ కొని కుట్టించు కోవచ్చు " అని సలహా ఇచ్చాడు.

" ఏం చెప్పను ? ఆ వాసన పడదు. ఒః సారు ప్రయత్నిస్తే ఏదో ఎలర్జీ వచ్చేసింది " అన్నాను.

ఒక్క నిముషం నిశ్శబ్దం. ఈలోగా నా ముక్కు మీద వాల్తున్న రెండు దోమల్ని చప్పట్లు కొట్టి చంపాను.

"అయితే నే చెప్పేది వినండి. నాకు ఓడోమస్ పడుతుంది. నాకు ముఖం మీంచి కప్పుకు పడుకునే అలవాటు, ఇవాల్టికి గాలిలో పడుకుంటాను. మీ బిస్తరు నా దోమతెరలోకి లాక్కోండి " అన్నాడు.

ఆ మాటల్లో ఏ సంకోచం కనపడక పోగానే నాకూ వేరే మార్గం కనిపించలేదు. అయితే వచ్చీ రాగానే పరిచయం లేని మనిషి ఔదార్యాన్ని వాడేసుకుంటున్నందుకు

కొంత గిలగిల లాడినా, నేను గీసుకున్న ఊహాచిత్రానికి తేడాగా ఉన్న వాణ్ణి చూసి ఊరట కలిగింది. చెప్పినట్టే చేసి హాయిగా నిద్ర పోయాను.

అలా ప్రారంభమైన సహజీవనం ఒక నెల రోజులు సాగింది. నేనిదివరకు చూసిన వాళ్ళతో పోలిస్తే కాస్త భిన్నంగా ఉన్నాడు. ఎలాటి వాడన్నది స్పష్టంగా చెప్పలేను కాని కాసింత పుస్తకాల పురుగు. నేనిదివరకు వినని పుస్తకాలు అతని చేతిలో కనపడుతూ వుండేవి. అది కంప్యూటర్ల కాలం కాదు. ఆదాయ వ్యయాలు, రిజిష్టర్లు, కాష్ బుక్కూ ఫైల్సు, ఓచర్లు - ఓపిగ్గా ఇద్దరం పంచుకుని - కలిసి మెలిసి పనిచెయ్యాలి. సబ్ రిజిష్ట్రీ లో టాక్స్‌లా పరిచయముండాలి. తహసీల్ కార్యాలయం లో లాండ్ రెవెన్యూ సిస్టమ్ అర్థం చేసుకోవాలి. కొంత సీనియర్ నుంచి నేర్చుకోవాలి. ప్రభుత్వ నిధులు ఖర్చుపెట్టే ఆఫీసులు తనికీ చేసినప్పుడు ఖర్చుచేసే వారిచ్చే ఆతిథ్యం, వసతీ స్వీకరించడం ఎంతవరకూ ఆరోగ్యకరం అన్న మీమాంస పక్కకి పెడితే ఈ అతిథీ గృహస్థు బంధుత్వం బ్రిటిష్ హయామ్ నుండీ ఉంది. అదొక రివాజూ, ఆనవాయితీగా వస్తోంది. మరీ మారు మూలల్లో ఆఫీసులు పెట్టాక ఈ ఆతిథ్యం స్వీకరించడం అనివార్యంకూడా అయి కూర్చుంటోంది.

గృహస్థులు, వారి సిబ్బంది గడుసరులై ఆవులిస్తే ప్రేవులు లెక్క పెడతారు. గాలిలో ఎగురుతూ ఎగురుతూ నీటి కాకులు చేపల కదలిక పసికట్టిన నేర్పులాటిదే. అతిథులై వచ్చినవారి కట్టూ బట్టా, బొట్టూ, మాట తీరూ చూసి వాళ్ళలో నిక్షిప్తమైన బలహీనతల్ని అతి సున్నితంగా తీసిఆడుకుంటారు. దైవభక్తీ, వల్లమాలిన పాపభీతి వుంటే పాపికొండల్నించి భద్రాచలమో, శ్రీకాకుళం నుంచి సింహాచలమో తీసుకెళ్ళిపోతారు. అతిథిలో ఏ ధర్మరాజో దాక్కొని వుంటే తీసి నేరుగా క్లబ్బుకి తీసుకుపోయి పేకాటలో ముంచేస్తారు. ఈ ఆతిథ్యం తాత్కాలిక ధర్మం అనుకోకుండా మగపెళ్ళివారిలా లాంఛనాలు తక్కువైనాయని అలిగి యాగీ చేసేవాళ్ళు ఆడిట్ వేపు నుంచీ ఉంటారు. అతని రికార్డు మీద పడవలసిన టైమూ, నిఘా ఎంత తక్కువైతే అంత మంచిదనే దృష్టి గృహస్థుది.

సోంపేట తర్వాత ఎక్కడో ఏదో ఊళ్ళో తహసిల్దార్ ఆఫీసుకి వెళ్ళాం. స్వాగతం చెప్పి కుర్చోబెట్టి కాఫీలు, కుశల ప్రశ్నలు అయినాక గోల్డ్‌ఫ్లాక్ సిగరెట్టు పేకట్ విప్పి మా ఇద్దరికీ చూపించాడు తహసిల్దార్. నేను ఒకటి అందుకుని ముట్టించాను. మూర్తి 'నో- థాంక్స్' అని అడ్డుగా తల ఆడించాడు.

రెండోరోజు క్యాష్‌బుక్ ఇంతవరకూ రాలేదేమిటని విసుక్కుంటూ వుంటే హెడ్ గుమస్తా సాయంత్రం నాలుగు గంటల వేళ వచ్చి నెమ్మదిగా మూర్తితో స్వరం తగ్గించి ఏదో అంటున్నాడు.

చెవులు రిక్కించి వింటున్నాను.

"ఇక్కడికి ఆరు గంటల ప్రయాణమే. రాత్రి వుండి రేపు వచ్చేస్తాము. కొండ మీద దేవర యోగ్యత వున్న భక్తుల్ని పిలిపించుకుని వరాలిస్తాడని ఇక్కడ అంతా నమ్ముతారు. తాసిల్దార్ జీప్ పంపిస్తామన్నారు..... "

మూర్తి తనికీ చేస్తున్న రిజిస్టర్‌లోకి చూస్తూ తల అడ్డుగా ఊపాడు. ఒక్క క్షణం ఆగి - "ఆయన వెళ్తారేమో కనుక్కో" అని నా దిశగా చూపించాడు.

నేను కూడా - రికార్డు రావలసింది ఇంకా రాలేదు. మాకిచ్చిన టైమ్‌లో పని పూర్తి అయ్యేలా లేదు. ఈ మారు వచ్చినప్పుడు చూద్దామని చెప్పి పంపించేశాను.

బాగా పొద్దుపోయేక బంగళాలో వరండా మీద విశ్రాంతిగా కూర్చున్నప్పుడు - "మీరు స్మోక్ చెయ్యరన్నమాట" - అన్నాను. అలా అడగడం అధిక ప్రసంగం కావచ్చు కానీ మూర్తిని అర్థం చేసుకునే ప్రయత్నంలో అనుకోకుండా వచ్చిన ప్రశ్న అది.

"చిన్నప్పుడు స్కూల్లో రెండు మార్లు కాల్చి చూశాను. అందులో రుచీ, ఆకర్షణా కలగలేదు. ఆ తర్వాత ఆరోగ్యం కాదని విని విని దాని జోలికి పోలేదు".

చాలా సాదాగా జవాబిచ్చాడు. నీకెందుకు నా విషయం- అన్న భావన ఎక్కడా పైకి కనపడలేదు. సగం చదివి విడిచిపెట్టలేని నవలలా ఉన్నాడు మూర్తి. నాకు తెలియకుండానే అతన్ని నిశిత పరిశీలన చేస్తున్నానేమో అని అనిపించింది.

ఇంతకు ముందు ఆఫీసుల్లో ఒక పెద్ద కారియర్‌తో భోజనం తెచ్చి మా ఇద్దరికీ అటెండర్ వడ్డన చేసేవాడు. ఇక్కడ ఆ రాత్రి రెండు వేర్వేరు కారియర్‌లు తెచ్చి ఒకటి ప్రత్యేకంగా నా ముందుంచాడు, తలపాగా చుట్టుకున్న వీరన్న.

ఆ సంకేతం నాకు కొంత అర్థమైంది.

మీరు తినండి. నాకు తొందరలేదు. కాస్సేపు పోయేక తింటానన్నాను - మూర్తి వేపు చూస్తూ. ఇది వరకు నాకు ఎదురైన కొన్ని సున్నితమైన ఇబ్బందులు మనసులో మెదిలాయి.

మూర్తికి నా సంకోచం అర్థమైనట్టులేదు.

"రండి కబుర్లు చెప్పుకుంటూ ఇద్దరం తినేద్దాం. టేబుల్ విశాలంగా ఉంది" అన్నాడు.

అలా ఆ రాత్రి నుంచీ ఇద్దరం ఏవో కబుర్లు చెప్పుకుంటూ తినడం అలవాటై పోయింది. నేనేం తింటున్నాను, ఎలా తింటున్నా నన్న దృష్టిలేదు. ఏవేవో కబుర్లు.

"నాకు ఎందుకో లెక్కలు బాగా అబ్బలేదు. మీరు అంకెల్లో చాలా ఫాస్ట్ చూశాను. విలేజ్ అకౌంట్స్ చెక్ చేస్తున్నప్పుడు ఆశ్చర్యం వేసింది" అన్నాడు.

మరి ఈ మూర్తికి ఇతరులతో సరిపడదన్న పేరు ఎందుకు వచ్చిందో?

ఆ తర్వాత మేం హైదరాబాద్‌లో పదిహేను రోజులు ఏవో ఆఫీసులు చూసి అదిలాబాద్ నుండి ఒక మధ్యాహ్నం అసిఫాబాద్ మీదుగా సిర్‌పూర్ వెళ్లాం. అక్కడ పని కేవలం రెండు రోజులే. అరక్ డిపో రికార్డ్ చెక్‌చేసి రిపోర్టు పంపాలి.

అసిఫాబాద్‌లో మధ్యాహ్నం తృప్తిగా భోజనం దొరకలేదు. ఏదో చిన్న హోటల్. బస్సుదారిలో చెడింది. అది బాగుపడి సిర్‌పూర్ చేరే సరికి రాత్రి ఎనిమిదిన్నర అయింది. ఇద్దరికీ ఆ ఊరు కొత్త. రైల్వే స్టేషన్‌కి ఆనుకుని పెరిగిన చిన్నఊరు అది. మూడు, నాలుగు ఆఫీసులు, ఉద్యోగులూ. మేం మట్టి కొట్టుకుపోయి, అలసి వచ్చాం. రైల్వే స్టేషన్ దగ్గర ఒకటే చిన్న హోటల్. దాన్ని ఎనిమిదవగానే మూసేసి వాడెక్కడికో పోయాడు. డిపో మానేజర్ అతికష్టం మీద ఆఫీసులోనే ఒక

గదిలో మాకు పడకలు వేయించాడు. భోజనానికి ఇంటికి తీసుకువెళ్ళాడు. ఆయన భార్య సత్తెకాలపు మనిషిలా ఉంది. చాలా బాధపడిపోయింది.

''ఇంటికి వచ్చిన సార్లకు బువ్వ పెట్టలేక పోతే ఎలా. కూరగాయల్లేవు. అన్నం గుడ్డు కూరే ఉంది'' అంటోంది భర్తతో.

అక్కడ గిరిజనాలు వారం కోమారు సంతచేసి కూరగాయలు అమ్ముతారట. అవి మూడు రోజులకే వాడిపోతాయట - మరి ఏవీ ఎక్కడా దొరకవట.

''ఏమీ బాధ పడకండి. కాసింత మజ్జిగ అన్నం చాలు'' అన్నాడు మూర్తి.

ఆమె ఇంకా బాధపడిపోయింది. ''పెరుగూ మజ్జిగ మా ఇంట వుండవు'' - అంటూ భర్త మీద విరుచుకు పడింది. ''ముందుగా సార్లు వచ్చేది ఉందని చెప్పనైతివి. ఎంత పాపం! మంచిగా.....''

ఏమీ బాధపడవద్దని ఇద్దరం గుడ్డు కూరా అన్నం తినేశాం. ఆకలి తీరాక విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు అనుకోకుండా మూర్తితో,'' మీరు ప్యూర్ వెజిటేరియన్ అనుకున్నాను. కాకపోవడం మంచిదే అయిం''దని - అన్నాను.

అతనిలో ఏ తడబాటూ కనపడలేదు. నా ప్రశ్నతో ఆ దినం కొంత వరకూ అతని వ్యక్తిగత జీవితంలోకి తొంగి చూశాను.

''ప్యూర్ వెజిటేరియన్లు ఇప్పుడు కాదు కదా సుమారు నూట అరవై ఏళ్ళ క్రిందటే లేరు. ఒక వైష్ణవాచార్యుడు కాశీయాత్ర చేసి కలకత్తా మీంచి తిరిగి మద్రాసు వస్తూ ధర్మసూక్ష్మంలో ఇరుక్కుపోయాడు. అక్కడి బ్రాహ్మలు జలపుష్పాలని చేపల్ని తింటున్నందుకు విస్తుపోతూవుంటే ఒక బెంగాలీ ఎదురు ప్రశ్న వేశాడు. ''మీరు తాంబూలం వేసుకుంటారు గదా! అందులో గుల్ల సున్నం చేపల, నత్తల వెన్నెముకలు కాల్చినదే కాదా'' అన్నాడు. పాపం ఆ అయ్యవారు నిజమే అని అంగీకరించాడు. తల్లి మాట నిలపడానికని గాంధీ కొంత సమాధాన పరచుకుని రాజీపడినా మేకపాలు శాకాహారం కాదు కదా. ఇక నా లాటి సామాన్యుడి విషయానికొస్తే నేను గుడ్డు కూర తినడానికి చాలా బలమైన కారణం ఒకటి ఉంది. ఆ గోలంతా మీకెందుకు'' అని ఊరుకున్నాడు.

నాకెందుకో వినాలన్న కోరిక కలిగింది.

"మీకు అభ్యంతరం లేకపోతే చెప్పండి" అన్నాను.

"నా చిన్నతనంలో మా ఇంటి కెదురుగా ఒక ముసలాయన ఉండేవాడు. వాళ్ళు మాంసాహారులే. ఆయన కూతురు సుమారు ఇరవై ఏళ్ళ లోపునే ఉండేది. పెళ్ళయినా పిల్లలు కలగలేదు. విచారం. పాతరోజులు కదా! నాకు నాలుగైదేళ్ళుండగా వాళ్ళ ఇంటిలో అరమరిక లేకుండా ఆడుకునేవాణ్ణి. ఆ అమ్మాయినే అక్కా అని పిలిచేవాణ్ణి. నా తల దువ్వి, పండూ కాయా ఇచ్చి, మిఠాయి నాకోసం దాచి పెట్టి ఎంతో ప్రేమగా చూసేది. నేను పొరపాటున వాళ్ళ గడపలో పడి దెబ్బ తగిలించుకుంటే కళ్ళ నీళ్ళు పెట్టుకుని 'మీ అమ్మ ఇక మా ఇంటికి పంపదేమో' అని భయపడేది. నాక్కూడా ఆమెతో విడవలేని బంధం పెరిగింది. ఒక రోజు ఆమె తింటున్న కూర నాకు పెట్టమని మారాం చేశాను. నుదుటిని మునివేళ్ళతో తట్టుకుంటూ - "నేనేం చేయనమ్మా! పిల్లడు అడిగితే పెట్టక నే తింటే పాపం. నే పెట్టినా అదీ పాపమే' అని మధన పడిపోయింది. అప్పటికి నాకు ఆమె పడ్డ బాధ అర్థంకాలేదు. గట్టిగా మారాం చేస్తే కోడికూర నోటపెట్టి - 'మీ అమ్మతో చెప్పావా ఇక మా ఇంటికి పంప'దని కన్నీళ్ళు పెట్టుకుంది. అలా నా వెజిటేరియనిజమ్‌కి చిన్నతనంలో దెబ్బ తగిలింది. వాళ్ళింటికి వెళ్ళకపోతే తోచేదికాదు. ఆ కారణంగా నాన్ వెజిటేరియన్స్ అంటే జుగుప్సా - మాంసాహారం అంటే వెగటూ లేకుండా అలవాటు పడిపోయాను. నా దృష్టిలో అలా కొంత మంచే జరిగింది" - అన్నాడు.

"మరి ఇంతకు ముందు మీరెందుకు తినలేదూ?" అన్నాను. ఈ విషయంలో నేను ఉత్సాహం చూపడం నాకే వింతగా అనిపించింది. అతని పట్ల ఉత్సాహమా? అపనమ్మకమా? అర్థంకాలేదు.

"మేనేజర్ భార్య ఈ కాలపు మనిషిలా నాకు కనపడలేదు. కడుపునిండా తిండి పెట్టలేకపోవడం పాపమని గింజుకుంది. చిన్నతనంలో మా ఎదురింటిలోని అక్క గుర్తొచ్చింది. ఆమె పెట్టినది బావుందని తృప్తిగా తినడంలో ఒక ఆనందం కలిగింది" అన్నాడు మూర్తి.

ఉపన్యాస ధోరణిలోకి పోతున్నట్టనిపించి వింటున్నాను.

"చాలా మంది పడమటి దేశాల్లోని శాస్త్రవేత్తలూ, మేధావులూ సాత్వికాహారాన్ని తీసుకుని మాంసాహారాన్ని విడిచి పెట్టారు. మన దంత నిర్మాణం, జీర్ణించుకునే వ్యవస్థ, నోటిలోని ఉమ్మి శాకాహారానికి తగినట్లే ఉందంటారు....."

"పడమటి మేధావులెవరు?" అని అడిగాను ఉత్సాహంగా.

"టాల్‌స్టాయ్, వెల్స్, జూలియన్ హక్సలీ, ఐజాక్ న్యూటన్ బెర్నార్డ్ షా ఇంకా ఇంకా వెనక్కి పోతే పైతాగరస్, సోక్రటీస్, చార్లెస్ డార్విన్......" అంటూ వర్ణించుకుపోతున్నాడు.

"అబ్బో పెద్ద పరిశోధన లాంటిది చేసినట్లున్నారే" అన్నాను.

"నాకు చరిత్ర అంటే చచ్చే ఇష్టం. వెనక్కి చూడ్డం సరదా" అంటూ నవ్వాడు.

అప్పుడు నాకు గుర్తొచ్చింది అతని పుస్తకాల్లో చూసిన స్టడీ ఆఫ్ హిస్టరీ.

"మరి మన దేశంలో.... ? అని కదిపాను ఏమంటాడో విందామని.

"ఇక్కడ పెద్ద తేడా కనిపిస్తుంది. పాశ్చాత్యుల్లో కొందరు శాఖాహారాన్ని ఇష్టపడ్డా మాంసాహారులకి దూరంగా జరిగిపోలేదు. చిన్న చూపు చూడ్డంలేదు. మన పూర్వీకులంతా తొలి రోజుల్లో ఆహారపు కట్టుబాట్లు గట్టిగా లేకపోయినా బౌద్ధ మతం, జైన మతం వచ్చాక ఆహార నియమాలతో దూరంగా జరిగిపోతూ వచ్చారు. దీని మూలంగా సామూహిక జీవితంలో సహజంగా ఉండే విలీనం చేసుకునే శక్తి తగ్గుతూ వచ్చింది. ఆహారపు కట్టుబాట్లకి ఒక ప్రతిష్ఠ కలిపించుకుని దూరం జరిగిపోయేరేమో".

ఈ మాటల్లో ఒక విధమైన నిరాశ ఉంది. మాట్లాడించాలనిపించింది.

"విలీన శక్తి అంటే?" -అడిగాను.

"సాధారణంగా లెక్కలు బాగా చేసే వాళ్ళు హిస్టరీని డబ్బా సబ్జెక్టని అంటారు. మరి మీ సంగతేమిటో? చాలా దేశాల్లో కొత్తగా పై నించి వచ్చిన మనుష్యులు నెమ్మదిగా సహజీవనం చేసి ఉన్న వాళ్ళతో కొంత కాలానికి పాలూ నీళ్ళుగా

కలిసిపోవడం జరుగుతుంది. ఉదాహరణకి బ్రిటన్స్‌తో ఆంగ్లోశాక్సన్లు, డేన్స్ వచ్చి కలిశారు. ఆ తర్వాత పదకొండో శతాబ్దంలో ఫ్రాన్స్ ఉత్తర భాగం నుంచి వచ్చిన నార్మన్లు ఇంగ్లండుపై దండయాత్ర చేసి ఆక్రమించుకున్నారు. చాలాకాలం వేరే వేరే శాసనాలు, నిర్బంధాలు చేసి ఆంగ్లో శాక్సన్ల సంస్కృతిని తక్కువ చెయ్యడం, నిరంకుశంగా వివక్షతో పాలించడం చేశారు. క్రమంగా కొన్నాళ్ళకి ఔదార్యం, అవగాహన ఉన్న రాజులు వచ్చారు. ప్రజలు సహకరించారు. గాయాలు, అవమానాలు మరచి ఒకటై పోయారు. ఇప్పుడు ఎవరు నార్మన్లో, ఎవరు ఆంగ్లోశాక్సన్లో చెప్పడం కష్టం అంటారు - అక్కడి కెళ్ళినవారు. అలాటి మార్పుకి 'మేధావులు, పాలకులు, ప్రజలు, రచయితలు అంతా తలో చెయ్యి వెయ్యాలి. మరి వేల సంవత్సరాలుగా సహజీవనం చేసినా, చరిత్రనీ సంస్కృతినీ పంచుకున్నా విలీనం కాకుండా నిలిచిపోవడం తలచుకుంటే చాలా ఆశ్చర్యంగా తోస్తుంది''.

'ఇలాంటి మనిషి ఆడిట్ ఆఫీస్‌లోకి ఎందుకొచ్చాడబ్బా ఏదో యూనివర్సిటీలోకి పోక' అనుకొన్నాను.

''కారణమేమై ఉంటుందో కొంత మీరే ఊహించగలరేమో'' - అన్నాను.

''తొలి రోజుల్లో అంతా భావుకులు. తియ్యని కలలెన్నో కన్నారు. ఉదాత్తమైన భావాలు నాలుగు దిక్కుల నుండీ రావాలి అని ఆహ్వానించారు. అసలు భూమ్మీద జనాలంతా ఒక కుటుంబం అన్నారు. శాంతి మంత్రం చదివారు. సృష్టి అంతా సమగ్రం, సంపూర్ణం అన్నారు. ఆ తర్వాత వచ్చిన మార్పుల్లో అధికారాన్ని నిలుపుకోవడం మీదున్న ధ్యాస అందరినీ కూడగట్టుకోవడంలో సన్నగిల్లిపోయింది'' అన్నాడు.

ఇలా ఎన్నెన్నో సున్నితమైన విషయాల్ని ఇద్దరం చర్చించుకుంటూ గడిపినట్లు అంతకు ముందు నా అనుభవంలో ఎప్పుడూ జరగలేదు. ఒక తహసిల్ ఆఫీసులోనే ఊహించని చిత్రమైన సంఘటన వచ్చిపడింది.

ఒక సాయంకాలం మేం ఉంటున్న బంగళా వరండాలో నేను విశ్రాంతిగా కూర్చున్నాను. మూర్తి కాస్త దూరంగా, ఒక దీపస్తంభం వెలుగులో ఏవో పూల

మొక్కల్ని చూస్తున్నాడు. ఒక అటెండర్ తలపాగా చుట్టుకుంటూ వచ్చి నా ఎదురుగా నిలబడ్డాడు. ఏదో చెప్పాలన్న తపనతో చెప్పలేని ఇబ్బందితో నసుగుతున్నాడు.

ఏం కావాలన్నట్టు వాడి మొహంలో చూశాను.

"మీరు ఇల్లూవాకిలీ వదిలి చానా రోజులైపోయింది గదా ఇక్కడ చానా మంచి అమ్మాయిలు...... భయమే లేదు.... "

"మేమెలా కనిపిస్తున్నాం?" అన్నాను సీరియస్‌గా చూసి. మధ్యాహ్నం అగ్ని ప్రమాదంలో బాధితుల ఫైళ్ళూ, అకౌంట్లు అందులో అవకతవకలూ చూస్తున్నప్పుడు అక్కడ తచ్చాడిన అకౌంటెంట్ ఈ అటెండర్‌ని పంపినట్లు ఏదో అనుమానం కలక్కపోలేదు.

అటెండర్ ఏమీ తడబడకుండా, "కిందటి ఆడిట్ వాళ్ళు అడిగితే నేనే ఏర్పాటు చేశాను సారూ!" అన్నాడు.

ఎంత గడుసుగా ఉందామాట! అందులోని తుంటరితనం నాకర్థం కాకపోలేదు. కసిరి పొమ్మనబోతూ వుంటే నాలోనూ కాసింత అల్లరి ఆలోచన వచ్చింది. మూర్తి ఎలా స్పందిస్తాడో చూడాలనిపించింది.

"ఆయన్ని అడుగు ఏమంటాడో" అని అటు చూపించాను.

గార్డెన్‌లో లైటు కింద మూర్తి మొహం నాకు స్పష్టంగా కనిపిస్తోంది. నేనేమో ముసురుకున్న చీకటిలో ఉన్నాను.

మూర్తి తల అడ్డంగా ఊపి పొమ్మన్నాడే కానీ ఏ ఆవేశమూ కనపర్చలేదు. నిరామయంగా ఉన్నాడు.

అటెండరు తల వంచుకు పోయాడు.

మేం రాత్రి భోజనం చేస్తున్న వేళ నెమ్మదిగా ఆ విషయం తీసుకొచ్చాను.

"మీరు చిన్నప్పుడు సిగరెట్టుతో ప్రయోగం చేసినట్లే ఏమైనా ప్రయోగం చేస్తారేమో అనుకున్నాను-" అంటూ చనువు తీసుకున్నాను.

ఆ జవాబు చిత్రంగానే వచ్చింది. వింటున్నాను.

"సిగరెట్టు ప్రయోగం నా వ్యక్తికి సంబంధించినది మాత్రమే. ఇలాంటి ప్రయోగం చెయ్యాలంటే పాపపుణ్యాల మాట ప్రక్కన పెట్టి కనీస న్యాయాన్ని పాటించాలి కదా" అన్నాడు మూర్తి చిన్నగా నవ్వుతూ.

అర్థం కానట్టు చూశాను.

"అలాటి ప్రయోగం నా భార్య చేసినా సహించగల మనస్సుని నే పెంచుకోవాలి కదా. ఇది దాంపత్య న్యాయం".

నేనలా సున్నితమైన విషయాన్ని కదిపినందుకు ఏ ఇబ్బందీ మొహంలో కనపరచకుండా అన్న మాటలు నన్ను కాసింత ఆలోచించేలా చేశాయి. నేను సిగ్గుపడ్డాను. మూర్తి కొత్తగా కనపడ్డాడు. ఇది వరకు ఓ మారు ఆడిట్ పార్టీలో తిరిగిన అనుభవాల్లో నే చూసిన వ్యక్తులూ జ్ఞాపకం వచ్చారు. వాళ్ళలో ఎన్నో చిత్రమైన బలహీనతలు. కొన్ని ఇప్పటికీ నా కళ్ళకు కట్టినట్టు గుర్తున్నాయి.

ఒకమారు మా పార్టీని పర్యవేక్షించడానికి ఒక ఆఫీసరు వచ్చాడు. మాటి మాటికీ విదేశాలు తిరగాననీ, ఎంబసీ ఆఫీసులు ఆడిట్ చేశాననీ చెప్పుకునేవాడు. రోజూ విధిగా పూజలు చేసేవాడు. గృహస్థుల ఏర్పాటుతో, ఖర్చులతో వాళ్ళ వాహనాల మీద గుళ్ళూ గోపురాలు విడవకుండా చూసేవాడు. హారతి పళ్ళెంలో మాత్రం జేబులోంచి పైసా తీసి వెయ్యాలంటే విలవిల్లాడేవాడు. ఎప్పుడొచ్చినా రెండో మూడో సిగరెట్ ప్యాకెట్లు ఖరీదైన బ్రాండ్ అడిగి తెప్పించుకునేవాడు. నిజానికి అతన్ని హైదరాబాద్‌లో ఎప్పుడూ నే చూస్తూనే ఉండేవాడిని. ఒకనాడూ స్మోక్ చెయ్యడం చూడలేదు. ఒకరోజు నేనూ అతనూ ఒకే రైల్లోంచి దిగాము. అతని సూట్‌కేస్ మూత సరిగ్గా వెయ్యని కారణంగా విడిపోయి ప్లాట్‌ఫామ్ మీద ఎన్నో సిగరెట్ ప్యాకెట్లు జలజల రాలిపోయాయి. ఆ తర్వాత తెలిసింది వాటిని తీసుకుపోయి అతని బావమరిదికి కానుకగా ఇస్తాడని.

మరి ఇలాంటి వ్యక్తుల సరసను మూర్తిని నిలబెట్టాలని నాకు అనిపించలేదు. శ్రీకాకుళం వేపు తిరిగే పార్టీ అని ఎంతో సందేహించినా నేను నష్టపోలేదు. కొంత కొత్త పని నేర్చుకున్నాను. అదేదో ట్రేడ్ సీక్రెట్‌లా మూర్తి దాచేసుకోలేదు. ఒక ఏడాది పాటు నల్లేరు మీద బండి సాగినట్లు ఆడుతూ పాడుతూ మా పార్టీ మంచి రిపోర్టులే హెడ్ క్వార్టర్‌కి పంపించింది.

అయితే హైదరాబాద్ చేరగానే మా విభాగంలో కొందరు ఆశ్చర్యంగా మాట్లాడుకోవడం నా చెవిని పడకపోలేదు. మూర్తి పార్టీలో ఏ పేచీ లేకుండా సాగడం ఒక పెద్ద వార్తగా చెలామణి అయింది. అలాటి అపకీర్తి ముద్ర మూర్తి మీద ఎందుకు పడింది?

పిల్ల కాలవలు, వాగులు, సెల ఏళ్ళు, నదులు, ఉపనదులు, ఒరుసుకుపోతూ, పరిగెడుతూ వాటికి కావలసిన ఒడ్లనూ, గాడీలను నిర్మించుకుపోతాయి. ఈ సమాజం కూడా ప్రవహించే మానవ సమూహాల సమాహారం. వాటి వాటి ఆలోచనల వేరు. ఆశలు వేరు. అహంకారాలు వేరు. ఆ మూస ఆలోచనల్లోంచి కాసింతగా ఏ ఒక్కడు బయటపడి వేరుగా వ్యవహరించినా ఆ సమూహం సహించదు. కాపు కుక్కల సహాయంతో గొర్రెల్ని మందలోకి లాగేసుకుంటుంది. అలాటి ఒక సమూహంలో మూర్తి కూడా సులభంగా ఇమడలేని 'ఉలిపి కట్టె' అయివుంటాడు.

సమాజం స్వరూప స్వభావాల్లో ఏ మాత్రం మార్పు రావాలన్నా, విలీన శక్తి పుంజుకోవాలన్నా ఉలిపి కట్టెల అవసరం ఉంటుందేమో!

మీరేమంటారు?

✣ ✣ ✣

*సుజనరంజని - అమెరికా*

*రచన, సంక్రాంతి కథల ప్రత్యేక సంచిక జనవరి 2004)*

✣ ✣ ✣